# తెల్లవారొద్దు —చెన్నూరి నాగరాజు

గోడకున్న బిగ్‌బెన్ అయిదుగంటలు చూపిస్తుంది. ఇంకో గంటలో తెల్లవారుతోంది. సదానందానికి భయంగా వుంది. గంటలో తెల్లవారగానే తను సమస్యల వలయంలో పడతాడు. ఈ ఉదయాన్ని ఎదుర్కొనే సమస్యలలో కనీసం ఒక్క సమస్యనైనా ఎదుర్కొన గలిగే ఆత్మస్థైర్యంలేదు. తెల్లవారగానే పాలవాడితో యుద్ధం, పనిమనిషితో యుద్ధం, చాకలివాడితో యుద్ధం, పాన్‌షాపువాడితో యుద్ధం, మధ్యాహ్నం ఆఫీసు క్యాంటీన్ వెధవతో యుద్ధం.

టక్....టక్....టక్....టక్... చప్పుడు. ఈ చప్పుడు బిగ్‌బెన్‌ది కాదు సదానందం గుండెది. లెక్కెడుతున్నాడు. గుండె చప్పుళ్ళను వన్.... టూ....త్రీ .... ఫోర్.... సెవన్ .... థర్టీన్.... ట్వంటీ... థర్టీఫైవ్....ఫార్టీ....ఫార్టీసెవన్.... ఫిఫ్టీటూ....ఫిఫ్టీఫైవ్....సిక్స్టీఫోర్... సెవెంటీ సెవంటీటూ నిముషం గడిచిపోయింది. నిముషంలో గుండె డెబ్బయిరెండుసార్లు కొట్టుకొంది. యింకా యాభైతొమ్మిది నిమిషాలు నాలుగువేల రెండువందల నలభై ఎనిమిది సార్లు ఈలోగా తన గుండె కొట్టుకొంటుంది. భరించలేను. వీధిలో నుంచుని చుట్టుపక్కల ఇళ్ళ వాళ్ళంతా వినేలా వాగే అడ్డమైన వాగుడుని సదానందం భరించలేడు. ఈలోగా తన గుండె ఆగిపోతే బాగుండుననుకున్నాడు. సదానందం గుండె కొట్టుకొంటూనేవుంది. బెడ్‌లైట్ వెల్తురులో బిగ్‌బెన్‌లోని సెకన్లముల్లు కదలడమూ కనిపిస్తూనేవుంది. కళ్ళు మూసుకున్నా నిద్ర రావడంలేదు. ఓ గంటసేపయినా ప్రశాంతంగా పడుకోవాలనుకుంటే ఉహూఁ! నిద్ర రాదే! నిన్న జరిగిన సంఘటన యింకా కళ్ళ ముందు నుంచి చెదిరిపోవటంలేదు.

తన చెల్లెల పెళ్ళికి మార్వాడి దగ్గర నాలుగేళ్ళక్రితం తెచ్చిన అప్పులో యింకా వెయ్యి రూపాయలు తీర్చవలసివుంది. వెధవ సరిగ్గా జీతం తీసుకునే టైముకే వచ్చాడు. కరకు చేతుల్తో, మొరటుమొహంతో అచ్చం తెలుగు సినిమా హీరోలా వున్నాడు. ఆ క్షణంలో జీతానికి తిలోదకాలివ్వక తప్పిందికాదు. లేకపోతే వాడు నడిబజారున లాగితే పరువేంకాను! నెలలో ముప్పయిరోజులు ఎలావున్నా ఒకటో తారీఖు సాయంత్రం చిరునవ్వుతో గుమ్మంలో నుంచొని స్వాగతం చెప్పే శ్రీమతికి జీతం రాలేదని అబద్ధం చెప్పక తప్పలేదు.

జీతం రేపయినా వస్తుందనే నమ్మకంతో ఈ ఒక్కరోజు పాలవాడికి నచ్చచెప్పలేనా అన్న భావంతో కాబోలు శ్రీమతి గాఢనిద్ర నుంచి యింకా మేలుకోలేదు.

ప్రతినెలా జీతం సరిగ్గా వస్తేనే పాలవాడికి సరిగ్గా డబులివ్వడంలేదు. పాలవాడికేమిటి ప్రతివాళ్ళకి యిచ్చేదాన్లోనూ తగ్గించందే మిగతా నెలంతా గడవదు. మరి ఈ నెల ఎలా? కళ్ళు మూసుకున్నా సదానందానికి ఆ చీకట్లో ఇంటి ఓనర్ రూపం కనిపించి భయపడి కళ్ళు మూసుకుంటే ఎక్కడ కనిపిస్తాడో అని కళ్ళు తెరుచుకుని పడుకున్నాడు.

ఇందాకట్నుంచీ గుర్తేలేదు: నెల కాగానే ఉదయమే వచ్చి తలుపుతట్టి ఈ నెల అద్దె యిస్తారా అంటాడు- సీతకోసం వచ్చిన రావణాసురుడిలా. గీత దాటితే ఏమవుతుందో అన్న భయం సీతకున్నట్లు గడప దాటితే ఏమవుతుందో అన్న భయం సదానందం గుండె చప్పుళ్ళను రెట్టింపు చేస్తుంది. ఉదయంకాగానే ప్రతీసమస్యా ఒక ప్రాణగండమే. పాలవాడికి పోయిన్నెల పదిరూపాయలు తక్కువిచ్చాడు. అంతకు ముందునెల ఎనిమిది రూపాయలు ఇవ్వాలి. ఈ నెల ముప్పయి రూపాయలు. మొత్తం నలభైఎనిమిదీ ఒక్కసారీ ఇవ్వకపోతే మర్యాద దక్కదని నిన్ననే హెచ్చరిం



చాడు. వాడి తప్పుమాత్రం ఏముంది? నెలనెలా డబ్బులు రాకపోతే వాడి కుటుంబం యెలా గడవాలి?

ఆలోచనలు తెగాయి, గాలిపటం అంతెత్తున ఎగిరి హఠాత్తుగా దారం తెగినట్లు. వాస్తవంలోకి వచ్చి బిగ్‌బెన్ చూశాను. ఆరుపది. అరే ఇంకా తెల్లవారదేం అనుకున్నాడు. కిటికీ తలుపులు తీసేవున్నాయి. కిటికీ అవతల నుంచి చుక్కలు కనిపిస్తున్నాయి. సదానందానికి బాగా జ్ఞాపకం వుంది ఆరుగంటలకి తెల్లవారుతుందని. అతని మనసులోని ఆలోచనలన్నీ యింకా యెందుకు తెల్లవారలేదన్న సమస్యవైపు మళ్లాయి. బిగ్‌బెన్‌లో పెద్దముల్లు కదులుతోంది. గంటల ముల్లు ఏడుమీదికి వచ్చింది. కాళ్ళతో బ్లాంకెట్‌ని తన్నేసి లేచాడు. ప్రపంచం గిర్రున తిరుగుతున్నట్లుగానూ, ఆకాశం క్రిందికి, భూమి పైకి మారినట్లుగానూ అనిపించింది. శ్రీమతి కూడా లేచింది. ఇంకా తెల్లవారలేదన్న ఆశ్చర్యం ఆమె కళ్ళనిండా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. పిల్లలు కూడా లేచారు. వాళ్ళకీ ఆశ్చర్యంగా వుంది. ఎవరికి ఆశ్చర్యంగా వుండదు కనుక.

ఆరు గంటలకు రావలసిన పాలవాడు యింకా రాలేదు. ఇంకా సూర్యుడూ రాలేదు. గూట్లోని టార్చ్ తీసుకొని గుమ్మం దాటాడు. పక్కింటి సుదర్శనము, ఎదురింటి ప్రకాశరావు ఆ పక్కింటిలో వున్న పెళ్ళికాని పంకజము యింకా ఆ వీధిలోని వాళ్ళంతా వాళ్ళవాళ్ళ గుమ్మాలాలో నుంచొని యింకా తెల్లవారక పోవడం గురించి చర్చించుకుంటున్నారు.

ఆ వీధిలోనే వుంటున్న సుఖజీవనరావు పరుగులాంటి నడకతో వచ్చాడు. ప్రతి చిన్న విషయానికి బోల్డు ఆశ్చర్యపడ్డా అతను యీ ఆశ్చరానికి తట్టుకోలేకపోతున్నాడు. ఏం మాట్లాడుతున్నాడో ఎవరితో మాట్లాడుతున్నాదో అతనికే అర్థంకావడంలేదు.

'ఏడు గంటలకి తెల్లవారకపోవడం ఏమిటి'

అని అందరినీ అడిగినా సుఖజీవనరావుకి తృప్తి కలిగించే సమాధానం దొరకలేదు.

'మళ్ళీ సతీసుమతి ఎవరైనా తన పాతి వ్రత్యాన్ని పరీక్షించుకోవడం లేదుకదా' అన్నాడు.

పాలవాడొస్తున్నాడు. అంతమందిలోనూ పంచాయతీ పడ్డదేమో. సదానందం అడుగులు వెనక్కి పడ్డాయి.

'ఏటండీ యింకా తెల్లవారలేదు. చూసి చూసి వస్తున్నా' అన్నాడు.

సదానందం మాట్లాడలేదు. పాలు పోశాడు. రేడియోలో ఏమన్నా చెప్పారా! అని అడిగాడు. సదానందానికి యింకా తెల్లవారకపోవడంకన్నా పాలవాడు డబ్బు అడగకపోవటమే ఆశ్చర్యంగా వుంది.

ఎనిమిదయింది. ఇంటాయన గొంతు విని పించింది గుమ్మం అవతల పిలుపు. తననికాదు. అయిదారు గొంతులు వినిపిస్తున్నాయి. బయటికి నడిచాడు సదానందం. 'ఏమండీ సదానందం గారూ ఏమిటీ విడ్డూరం. ఇలాంటిది ఎప్పుడైనా విన్నామా, కన్నామా' అన్నాడు-ఇంటి అద్దె అడగలేదు. ఇంకా తెల్లవారలేదేమిటి అంటు న్నాడు. లోకాభిరామాయణం. అంతా మాటల్లో పడ్డారు. సైకిల్ మీద పేపరు వాడు వచ్చాడు. అంతా పేపరు మీద దాడిచేసారు. తెల్లవారక పోవడం గురించి పేపర్లో ఏమీ లేదు.

తెల్లవారలేదు కనుక యింకా లైట్లు వెలుగు తూనే వున్నాయి. పాన్‌షాపు వాడు వచ్చి షాపు తెరిచాడు.

అందరితో పాటే సదానందం కూడా అక్కడికి నడిచాడు. సిగరెట్ యిచ్చాడు సదా నందానికి. అక్కడున్న యిద్దరి ముగ్గురికి కూడా సిగరెట్లిచ్చాడు. ఎవరి దగ్గరా డబ్బులు తీసుకోలేదు. ఇంకా తెల్లవారకపోవడం గురించి తమ వీధిలోని వాళ్ళ కంగారుని కథలుగా చెప్పుతున్నాడు.

"తొమ్మిదవుతుంది ఆఫీసులకు వెళ్దామా" అన్నాడు ప్రకాశరావు.

చీకట్లో ఆఫీసు. లైట్ల వెలుగులో ఆఫీసు ఎలా వుంటుందో?

ఇంటికెళ్ళాడు 'నాన్నా ఈరోజు మార్నింగ్ షో ఎలా వుంటుంది' అన్నాడు ఆఖరివాడు.... అందరికీ ఎన్నెన్నో సమస్యలుంటే వీడికి ఈ సమస్య. మళ్ళీ అడిగాడు మార్నింగ్ షో వుండదా అని. వాడే అడిగాడు మళ్ళీ నాన్నా మా స్కూల్లో కరెంటు లేదు స్కూలు ఎలా నడుస్తుంది అని.

ఎలాగో నాలుగు చెంబులు నెత్తిన పోసు కుని, ఉడికీ ఉడకని బియ్యం అన్నంగా తిని ఆఫీసుకి వెళ్ళాడు-అందరూ వచ్చారు. ఎవరూ పని చెయ్యడంలేదు. కబుర్లు. మేనేజర్ కూడా వచ్చాడు, వచ్చి స్టాఫ్‌తో కలిసి కూర్చున్నాడు.

పన్నెండున్నరకి రేడియోలో వార్తలు విన్నారంతా. తెల్లవారకపోవడం గురించి ఎవరూ ఆందోళన చెందవలసిన పనిలేదనీ, ఎందుకు తెల్లవారలేదో శాస్త్రజ్ఞులు ప్రారంభించా రనీ చెప్పారు. అత్యవసర ప్రాతిపదికపై ప్రతీ వీధికీ విద్యుద్దీపాలు ఏర్పాటుచేస్తారని అధికార ప్రకటన చేశారు.

అందరూ గడియారాలు చూసుకుంటున్నారు. గడియారలైతే నడుస్తున్నాయి కానీ ఎంతకీ వెలుగు రావడంలేదు-చీకటి-అంతా చీకటి. అందరి మనసుల్లోనూ చీకటి. సదానందానికి మాత్రం ఈ విచారం ఏమీలేదు. పాలవాడు డబ్బు అడగలేదు, ఇంటాయన అద్దె అడగ అడగలేదు. పాన్ షాపువాడూ అడగలేదు. తెల్ల వారకపోవడంవల్ల సదానందానికి కలిగే సౌకర్యం యిది. అంతా థ్రిల్‌గా వుంది. ఏదో ఏదోలా వుంది మరేదోలా వుంది.

మొహంమీద చెంబుడు నీళ్ళు పోసినట్లని పించింది. సదానందం కళ్ళు తెరిచాడు. ఎదురుగా భార్య! కళ్ళలో కోపం, బాధ కలగలిపి చూస్తోంది. ఆఖరివాడు ఆలపిస్తున్న ఆరు న్నొక్క రాగం చెవులని బద్దలు కొడుతుంది. "ఏడవుతోంది యిక లేవరా ఈవేళ. పాల వెధవొచ్చి నానామాటలూ అని వెళ్ళాడు, జీతం ఈవేళైనా వస్తుందా రాదా!!" యింకా యేమి టేమిటో అంటూంది. సదానందం మెదడు మొద్దుబారింది. □